



నాగన్నా.. చల్లగా చూడన్నా!

● వైభవంగా నాగుల చవితి


విజయనగరంలో పుట్టల వద్దకు వెళ్తున్న భక్తులు

జిల్లా ప్రజలు మంగళవారం నాగులచవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం కుటుంబ సమేతంగా పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రునికి పూజలు చేశారు. పుట్టలో గుడ్లు, పాలు, నువ్వుల ముద్ద వేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బాణసంచాను కాల్చారు. నాగేంద్ర చల్లగా చూడు అని వేడుకున్నారు. జిల్లా కేంద్రం విజయనగరంతో పాటు బొబ్బిలి, ఎస్.కోట, గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, చీపురుపల్లి, నెల్లిమర్ల, గరివిడి తదితర మండలాల్లో నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి.

-విజయనగరం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి)


విజయనగరం పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఫలించిన నిరీక్షణ

● నేడే డీఎస్సీ నోటిఫికేషన్ ● ఆనందంలో నిరుద్యోగులు
● జిల్లాలో భర్తీకానున్న 446 ఉపాధ్యాయ పోస్టులు



విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అభ్యర్థులు (ఫైల్)

విజయనగరం, కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టులపై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగ అభ్యర్థుల కల నెరవేరే సమయం ఆసన్నమైంది. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీకి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. జిల్లా వ్యాప్తంగా 446 పోస్టులు భర్తీకానున్నాయి. దీంతో నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఒక్క నోటిఫికేషన్ కూడా జారీ చేయలేదు. నిరుద్యోగుల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత రావడంతో సాధారణ ఎన్నికలు ముందు ఈ ఏడాది ఫిబ్రవరి 12న డీఎస్సీపై ప్రకటన జారీ చేసింది. అప్పటిలో జిల్లాలో 284 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రకటించారు. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో టెట్ పరీక్ష వాయిదా పడింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని అప్పటిలో చంద్రబాబు హామీ ఇచ్చారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబు రెండో సంతకం చేశారు. అందులో భాగంగా అక్టోబరు 3 నుంచి 21 వరకూ టెట్ పరీక్ష నిర్వహించారు. ఫలితాలు కూడా సోమవారం విడుదల చేసిన సంగతి తెలిసిందే. టెట్‌కు జిల్లాలోని 22,890 మంది దరఖాస్తు చేసుకోగా, 20,354 మంది పరీక్ష రాశారు. 2,534 మంది పరీక్ష దూరంగా ఉన్నారు. ఇందులో 50 శాతం మంది అభ్యర్థులు క్వాలీఫై అయ్యారు. ఈ నెల 6న డీఎస్సీ ప్రకటిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఉత్తరాంధ్ర నిరుద్యోగులు రెండు రోజులు కిందట పట్టణంలో కోట వద్ద సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఎలాగైనా పోస్టు దక్కించుకోవాలని నిరుద్యోగులు డీఎస్సీకి సిద్ధ పడుతున్నారు. ఇప్పటికే చాలా మంది పట్టణంలోని కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు. ప్రత్యేకంగా రూమ్‌లు తీసుకుని చదువుకుంటున్నారు.

పోస్టుల సంఖ్య పెంచాలి..



డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది. టెట్ ఫలితాల్లో 150కి 150 మార్కులు వచ్చాయి. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం వచ్చింది. రాష్ట్రంలోని విజయనగరం, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల్లో ఎస్‌జీటీ పోస్టులు చాలా తక్కువగా ఉన్నాయి. పోస్టుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. టెట్ నోటిఫికేషన్ ఇవ్వక ముందు నుంచి పట్టణంలోని వినెక్స్ కోచింగ్ సెంటరులో శిక్షణ తీసుకుంటున్నాను. రోజుకు 16 గంటలు పాటు చదువుతున్నాను. డీఎస్సీ పరీక్ష కోసం ప్రభుత్వం ఇచ్చిన 3 నెలల సమయం సరిపోతుంది. ఎలాగైనా పోస్టు సాధిస్తా.

-కొండ్రు అశ్విని, విజయనగరం

120 రోజుల సమయం ఉండాలి



డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినప్పటి నుంచి పరీక్ష నిర్వహణకు కనీసం 120 రోజుల సమయం ఉండాలి. మూడు నెలలు సమయం చాలదు. దీనిపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించి చర్యలు తీసుకోవాలి. జిల్లాలో ఎస్‌జీటీ పోస్టుల సంఖ్య పెంచారు. చాలా సంవత్సరాల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటిస్తుండడం శుభ పరిమాణం

-బాలకృష్ణ, నిరుద్యోగ అభ్యర్థి

ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం..

జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం. జిల్లాలో 446 పోస్టులు భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

-మాణిక్యం నాయుడు, డీఈవో

ఎప్పుడు తెరుస్తారో?

● తిరోగమనంలో నెల్లిమర్ల జూట్‌మిల్లు?
● ఐదు నెలలుగా మూత
● దోలాయమానంలో కార్మికులు
● పట్టించుకోని అధికారులు, పాలకులు

వందేళ్ల చరిత్ర ఉన్న నెల్లిమర్ల జూట్‌మిల్లు పరిస్థితి ఇప్పుడు తిరోగమనంలో పడింది. నార కొరతతో ఐదు నెలల కిందట మిల్లు మూతపడింది. మళ్లీ ఎప్పుడు తెరుస్తారా? అనే విషయంపై అటు యాజమాన్యం గాని, ఇటు కార్మిక సంఘం నాయకులు గాని చెప్పడం లేదు. దీంతో కార్మికుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.



నెల్లిమర్ల జూట్ మిల్లు

నెల్లిమర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి)

నెల్లిమర్ల జూట్ మిల్లు ఒకప్పుడు ఆరు వేల మంది కార్మికులతో కళకళ లాడేది. కార్మికులు కాలానుగుణంగా పదవీ విరమణ చేయడం, జూట్ ఉత్పత్తులకు పెద్దగా గిరాకీ లేకపోవడం తదితర కారణాలతో కార్మికుల సంఖ్య నానాటికీ తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం మిల్లులో మూడు షిఫ్టుల్లో 1500 మంది కార్మికులు ఉన్నారు. వీరిలో పర్మినెంట్ కార్మికులు 300 మంది మాత్రమే. మిగిలిన వారిలో ఎక్కువమంది రిటైర్డ్ కార్మికులు, రోజు వారీ కూలీలే. తమకు రావాల్సిన గ్రాట్యుటీ సొమ్మును యాజమాన్యం చెల్లించకపోవడంతో రిటైర్డ్ కార్మికులు ఇంకా విధులకు హాజరవుతున్నారు. 2016 జూన్ వరకు పదవీ విరమణ చేసిన వారికి యాజమాన్యం గ్రాట్యుటీ చెల్లింపులు పూర్తి చేసింది. ఆ తర్వాత రిటైర్ అయిన వారికి మాత్రం బకాయి పడి ఉంది. అలాంటి వారు సుమారు 1200 మంది కార్మికులు ఉంటారని సమాచారం. కొద్ది నెలలుగా నార కొరతతో దినదిన గండంగా మిల్లును నడిపిస్తూ వచ్చారు. ఒక రోజు మిల్లు నిర్వహణకు ఒక లారీ లోడు నార అవసరం. యాజమాన్యం ఏ రోజుకు ఆ రోజు ఒక లారీ లోడు నారను మాత్రమే తెప్పించి మిల్లును నడిపుతుండేది. దీనివల్ల ప్రతిరోజూ అవసరమైన నార వస్తుందో రాదో అనే కార్మికులు ఆందోళన చెందేవారు. దీంతో కనీసం ఐదు రోజులకు సరిపడ నార ఉంటేనే మిల్లు నడపండి అని కార్మికులు తెగేసి చెప్పారు. కార్మికులు కోరుకున్నట్లు యాజమాన్యం అవసరమైన నారను తెప్పించలేకపోవడంతో ఈ ఏడాది జూన్ 12వ తేదీన మిల్లు మూతపడింది.

అందుబాటులో లేని యాజమాన్య ప్రతినిధులు..

మిల్లు మూతపడి సుమారు ఐదు నెలలు గడిచింది. అయితే, దాన్ని తిరిగి తెరిపించేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తుందా?లేదా? అనే విషయం కార్మికులకే కాదు మిల్లు శ్రామిక సంఘం నాయకులకు కూడా తెలియని పరిస్థితి నెలకొంది. యాజమాన్య ప్రతినిధులు ఎవరూ స్థానికంగా లేకపోవడంతో ఎలాంటి సమాచారం బయటకు రావడం లేదు. ఇటు కార్మికులు సమ్మె నోటీసును ఇవ్వలేదు. అటు యాజమాన్యం కూడా లాకౌట్ వేసినట్లు ప్రకటించలేదు. అయినా మిల్లు ఎందుకు మూతపడిందో అర్థంకావడం లేదు. దీంతో ఇది లాకౌటా? లేక సమ్మెనా అనేది తెలియని పరిస్థితి నెలకొంది. దీనిపై శ్రామిక సంఘం నాయకులు చర్చలు జరిపేందుకు ఎదురు చూస్తున్నా యాజమాన్య ప్రతినిధులు అందుబాటులో లేరు. మిల్లును తెరిపించేందుకు చర్యలు చేపట్టాలని శ్రామిక సంఘ నాయకులు, సీఐటీయూ నాయకులు ఎమ్మెల్యే లోకం నాగమాధవికి, రెవెన్యూ, కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రాలు అందించనప్పటికి ఎలాంటి ప్రయోజనం లేకపోయింది.

మిల్లుకు పవర్ కట్?

మిల్లు జూన్ 12న మూత పడిన తర్వాత అదే నెలలో విద్యుత్ శాఖ అధికారులు మిల్లుకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వారు పవర్ కట్ చేశారు. మిల్లు తిరిగి పునఃప్రారంభం కావాలంటే విద్యుత్ బిల్లు తక్షణమే కట్టాల్సిన పరిస్థితి ఉంది. విద్యుత్ బిల్లు చెల్లింపునకు ప్రభుత్వం రాయితీ ఇస్తే, మిగిలినది చెల్లించేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే, కనీసం 50 లారీల నారను సిద్ధం చేస్తేనే ఎలాంటి ఆటంకం లేకుండా మిల్లు నడిచే అవకాశం ఉందని కార్మికులు చెబుతున్నారు.

మిల్లును తెరిపిస్తాం..



మిల్లును తెరిపించేందుకు మా వంతు కృషిచేస్తున్నాం. యాజమాన్యంతో చర్చించేందుకు ప్రతినిధులు అందుబాటులో లేరు. వారం రోజుల్లో చర్చలు జరిగే అవకాశం ఉంది. మిల్లు త్వరలో తెరవవచ్చు.

-సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్

ఎమ్మెల్యే, కలెక్టర్ జోక్యంచేసుకోవాలి..



నెల్లిమర్ల జూట్ మిల్లు మూతపడి ఐదు నెలలు కావస్తున్నా అధికారులుగాని, పాలకులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. కార్మికుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే, కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకోవాలి. మిల్లును తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలి.

-కె.రామారావు, సీఐటీయూ నాయకుడు

పక్కాగా ధాన్యం సేకరణ

● ఈ నెల మూడోవారం నుంచి కొనుగోలు
● జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో పక్కాగా, పారదర్శకంగా ధాన్యం సేకరణ నిర్వహిస్తామని జేసీ సేతుమాధవన్ తెలిపారు. ఈ ఏడాది సుమారు 3.20లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'జిల్లాను 258 క్లస్టర్లుగా విభజించాం. ఒక్కొక్క క్లస్టరులో రెండు లేదా మూడు రైతు సేవా కేంద్రాలు ఉంటాయి. ఈ ఏడాది 26 లక్షలు గోనె సంచులు అవసరం. మిల్లు సామర్థ్యం ప్రకారం 30 వేల సంచులు సిద్ధం చేయాలి. ధాన్యం తరలించడానికి 3వేలు వాహనాలను సిద్ధం చేశాం. జీపీఎస్ సదుపాయం ఉండి, సివిల్ సప్లయ్ వద్ద నమోదు చేసుకున్న వాహనాల ద్వారా మాత్రమే ధాన్యం తరలింపు జరుగుతుంది. ఈనెల మూడోవారం నుంచి ధాన్యం సేకరణ ప్రారంభిస్తాం' అని తెలిపారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయ్ డీఎం మీనా కుమారి, వ్యవసాయ శాఖ జేడీ రామారావు, డీసీవో రమేష్ ఉన్నారు.


మాట్లాడుతున్న జేసీ

వెయిట్‌లిఫ్టర్ల కొండవెలగాడ



4లో

నాకొద్దు ఈ ఎమ్మెల్సీ

● పోటీకి ముందుకు రాని ఆశావాహులు
● అధికారపార్టీ, ప్రతిపక్షంలోనూ ఇదే పరిస్థితి
● డబ్బు ఖర్చుతో పాటు పదవీకాలం తక్కువ ఉండడంతో ఆసక్తి చూపని అభ్యర్థులు

● నేను ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు ముందుకు వస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. ఓ ప్రజా ప్రతినిధి తన దగ్గరకు వచ్చే వారందరికీ నేను పోటీకి సిద్ధపడుతున్నట్లు అడిగినవారికి, అడగనివారికి చెబుతున్నారు. వారికి నా అభిప్రాయం చెప్పనేలేదు. నాకు ఎందుకు ఎమ్మెల్సీ. నేను పోటీ చేయను.

- సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించిన కూటమి నేత.

●ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేను పోటీ చేయను. అధిష్ఠానం ఎవరిని రంగంలోకి దించిన సహకరిస్తా. పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థికే అందరూ ఓటేయాలని నా మద్దతుదారులకు సూచించాను. జిల్లా పార్టీ దృష్టిలోనూ ఈ విషయాన్ని పెట్టాను.

- అప్పట్లో మంత్రి పదవి ఆశించిన వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే

శృంగవరపుకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు వెనకడుగు వేస్తున్నారు. అధికార టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీల్లో ఇది మరింత ఎక్కువగా ఉంది. డబ్బు ఖర్చు, పదవి కాలం తక్కువగా ఉండడంతో వైసీపీ నేతలు, మెజార్టీ ఓట్లు లేకపోవడంతో కూటమి పార్టీల నేతలు పోటీకి విముఖత వ్యక్తచేస్తున్నట్లు తెలుస్తుంది. 2021 డిసెంబరులో స్థానిక సంస్థల కోటాలో ఇందుకూరి రఘురాజును ఎమ్మెల్సీగా వైసీపీ ఎంపిక చేసింది. జిల్లాలోని స్థానిక సంస్థల్లో ఉన్న ఓట్లలో అత్యధికం వైసీపీకి చెందినవి కావడంతో అప్పట్లో టీడీపీ పోటీలో నిలవలేదు. దీంతో ఇందుకూరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో అప్పటి శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో విబేధాలు వచ్చాయి. దీంతో రఘురాజు వర్గమంతా, అతని భార్య సుధారాజు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిపోయింది. రఘురాజు మాత్రం వైసీపీలో కొనసాగినప్పటికీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు చూపించి ఈ ఏడాది జూన్‌లో ఆయనపై అనర్హత వేటు వేసింది. దీంతో ఈ స్థానం ఖాళీ అయింది. రఘురాజు కోర్టుకు వెళ్లినప్పటికీ ఎన్నికల సంఘం షెడ్యూల్ ఇచ్చేసింది. దీనికి ఇప్పుడు ఎన్నికలు జరిగినప్పటికీ 2027 డిసెంబరు 1 నాటికి పదవి కాలం ముగుస్తుంది. ఎవరు ఎన్నికైనా మూడేళ్ల మాత్రమే పదవిలో ఉంటారు. దీంతో ఓట్లున్న వైసీపీ నుంచి కూడా నాయకులు పోటీ చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో వైసీపీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైనా ఎటువంటి గౌరవం ఉండదని, అధికారులెవరూ పట్టించుకోరని, పైగా ఖర్చు రూ.కోట్లలో అవుతుందని చెప్పి ఆ పార్టీ నాయకులు పోటీచేసేందుకు తటపటాయిస్తున్నారు. ఇక టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విషయానికి వస్తే.. జిల్లాలో మూడోంతుల ఓట్లు వైసీపీకి ఉన్నాయి. వీరి నుంచి ఓట్లు పొందాలంటే కూటమి నేతలు బాగా శ్రమించడంతో పాటు క్యాంపు రాజకీయాలు నడపాలి. ఎంతోకొంత డబ్బును వెచ్చించాల్సి ఉంటుంది. అందుకే వీరు కూడా పోటీకి భయపడుతున్నారు. అయితే, షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి వైసీపీకి చెందిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావులు ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికకు కసరత్తు చేస్తున్నారు. నియోజకవర్గాలు వారిగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలతో చర్చించారు. విజయనగరం మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ కొలగట్ల వీరభద్రస్వామి నుంచి ఉలుకు, పలుకు లేదు. ఇలా ఎవరి నుంచి సరైన స్పందన లేకపోవడంతో ప్రధాన సామాజిక వర్గం కొప్పల వెలమకు చెందిన ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి చినఅప్పలనాయుడు పేరును పరిశీలిస్తున్నారు. దాదాపుగా శంబంగి చినప్పలనాయుడు పేరును ఖరారైనట్లేనని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. కూటమి అభ్యర్థిగా కిమిడి నాగార్జున, తెంటు లక్షునాయుడు, గొంప కృష్ణ వంటి నేతల పేర్లు తెరపైకి వస్తున్నప్పటికీ, వీరెవరూ పోటీ చేసేందుకు ఇష్టపడడం లేదని తెలిసింది. అభ్యర్థి ఎంపిక విషయమై సీఎం చంద్రబాబుతో చర్చించేందుకు మంగళవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజయవాడ వెళ్లినట్లు సమాచారం. ఇరుపార్టీల నుంచి అభ్యర్థుల ఎంపిక జరగకపోవడంతో మంగళవారం కూడా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు ఒక్క నామినేషన్ పడలేదు.



ఎన్నికల నియమావళి అమలుకు 23 బృందాలు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతున్న సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కోసం అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 23 బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ బృందాల్లో మున్సిపల్ కమిషనర్, తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్ఐ సభ్యులుగా ఉంటారని అన్నారు. బొబ్బిలి, చీపురుపల్లి, గజపతినగరం, నెల్లిమర్ల, ఎస్.కోటలో 6 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను అదనంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉప ఎన్నికకు సంబంధించి రాజకీయ పార్టీలు అభ్యర్థులకు సింగిల్ విండో ద్వారా అవసరమైన అనుమతులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. సింగిల్ విండోసెల్‌కు నోడల్ అధికారిగా ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ జోసెఫ్‌ను నియమించినట్లు తెలిపారు.

ఓటు హక్కు నమోదుకు నేటితో ముగియనున్న గడువు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుకు బుధవారంతో గడువు ముగియనుంది. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో 325 మంది, ఆఫ్‌లైన్‌లో 1328 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకున్నారు. చివరి రోజున ఎంతమంది దరఖాస్తు చేసుకుంటారో? చూడాలి.

వెయిట్‌లిఫ్టర్ల కొండవెలగాడ

● అంతర్జాతీయ స్థాయిలో రాణింపు
● ఫలిస్తున్న కోచ్ చల్లా రాము కృషి


కామన్‌వెల్త్ పోటీల్లో మత్స సంతోషి


కొండవెలగాడ గ్రామం

నెల్లిమర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వెయిట్ లిఫ్టింగ్..ఈ పేరు చెబితే నెల్లిమర్ల మండలం కొండ వెలగాడ గ్రామం గుర్తొస్తుంది. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ తరఫున, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం తరఫున వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన వారిలో కొండవెలగాడ క్రీడాకారులు ఎందరో ఉన్నారు. కనీస వసతులు లేకపోయినా... ప్రభుత్వ సాయం అందకపోయినా వారు అకుంఠిత దీక్షతో సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం విశేషం. గతంలో స్కాట్లాండ్ లో జరిగిన కామన్‌వెల్త్ దేశాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఈ గ్రామ క్రీడాకారిణి మత్స సంతోషి రజత పతకంతో దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన సంగతి తెలిసిందే. అదే గ్రామానికి చెందిన వల్లూరు శ్రీనివాసరావు 2010లో ఢిల్లీలో జరిగిన కామన్‌వెల్త్ దేశాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించి భారతదేశ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించాడు. కేరళలోని తిరుచూరులో జరిగిన జాతీయ పోటీల్లో వల్లూరు శ్రీనివాసరావు బంగారు పతకం సాధించగా, మొయిద రామ కృష్ణ రజతం, కాగిత వెంకటలక్ష్మి కాంస్య పతకం సాధించారు. ఇటీవల శనపతి గురునాయుడు కూడా కామన్‌వెల్త్ పోటీల్లో మరోసారి కొండవెలగాడ విశిష్టతను చాటిచెప్పాడు.

పతకాల సాధనలో...

కామన్‌వెల్త్ పోటీల్లో కాంస్యం సాధించిన సంతోషి రాముకు ఒకప్పటి శిష్యురాలు. ఆమెతో పాటు మరో 12 మంది క్రీడాకారులు తన శిక్షణలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని చాంపియన్లుగా నిలిచారు. గ్రామానికి చెందిన కాగిత వెంకటలక్ష్మి 2012లో సమోవా దీవిలో జరిగిన కామన్‌వెల్త్ దేశాల జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణపతకం సాధించింది. అదే గ్రామానికి చెందిన మొయిద రామకృష్ణ 2009లో జరిగిన కామన్‌వెల్త్ దేశాల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించాడు. శనపతి పల్లవి, శనపతి గురునాయుడు, బెల్లాన హారిక, చుక్కా శ్రీలక్ష్మి, వల్లూరి అజయ్‌బాబు, బొంతు అశ్విని, కె.గౌరి బాబు, బి.శ్రీను, వి.చిన్నంనాయుడు, మొయిద శివ, బి.రవి, టి.సుధీర్ తదితరుల జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించారు. విశాఖకు చెందిన అలీమా బేగం కూడా రాము వద్దనే శిక్షణ తీసుకుని పతకాలు సాధిస్తోంది. అంబటి వలసకు చెందిన పి.వెంకటేశ్వరరావు జాతీయ చాంపియన్‌గా నిలిచాడు. ప్రస్తుతం రాము వద్ద సుమారు 40 మంది శిక్షణ పొందుతున్నారు. ఇన్ని విజయాలు సాధిస్తున్నా... ఇక్కడి క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందడం లేదు.


కామన్‌వెల్త్ పోటీల్లో వల్లూరి శ్రీనివాసరావు

కనీస వసతులు లేకపోయినా..

జిల్లా కేంద్రం విజయనగరంతో పాటు కేవలం కొండవెలగాడలో మాత్రమే అత్యధిక వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు ఉన్నారు. దీనితో పాటు పరిసర గ్రామాలైన అంబటివలస, కొండగుంపాం, గరుడుబిల్లి, లక్కిడాంల్లో మాత్రమే క్రీడాకారులు ఉన్నారు. కొండవెలగాడ గ్రామానికి చెందిన చల్లా రాము అనే క్రీడాభిమాని చలవతో శిక్షణ, సాధన నడుస్తున్నాయి. ఈ సాధనే సంతోషిని ఈ స్థాయికి తీసుకువచ్చింది. మొదట్లో గ్రామంలో ఉన్న ఖాళీ స్థలాలు, ఆలయాల పరిసరాల్లో సాధన చేసేవారు. మూడేళ్ల నుంచి చల్లా రాము స్వయంగా నిర్మించిన ప్రైవేటు భవనంలో ఈ శిక్షణ కార్యక్రమం నడుస్తోంది. 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుమారు రూ.65 లక్షలతో వ్యాయామశాల భవనం మంజూరు చేసి కొన్ని పరికరాలను అందించారు. అంతకుమించి అధికారులు..ప్రజాప్రతినిధుల నుంచి క్రీడాకారులకు ఎటువంటి సాయం అందడం లేదు. చల్లా రాము నిర్వహిస్తున్న ప్రైవేటు శిక్షణకేంద్రం వైపే ఎక్కువ మంది క్రీడాకారులు సాధనకు మొగ్గు చూపుతున్నారు.


శనపతి పల్లవి

బరువులను ఎత్తలేకపోయినా...

నిజానికి చల్లా రాము క్రీడాకారుడు కాదు. ఇంకా చెప్పాలంటే వికలాంగుడు కూడా. ఆయన బరువులను ఎత్తలేడు. క్రీడా శిక్షణ బాధ్యతను తన భుజస్కందాలపై మోస్తున్నాడు. 1997కు పూర్వం తన సోదరి చల్లా అన్నపూర్ణ వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయి చాంపియన్‌గా నిలిచింది. ఆ సమయంలో శిక్షణకు రాము తన సోదరి అన్నపూర్ణను నిత్యం విజయనగరంలోని కోడి రామ్మూర్తి వ్యాయామ శాలకు తీసుకు వెళ్లేవాడు. దీంతో క్రీడాకారులకు అవసరమైనమెలకువలు... తీసుకోవాల్సిన ఆహారం... సాధనలో జాగ్రత్తలు తదితర అంశాలపై రాము అవగాహన పెంచుకున్నాడు. సోదరి అకాల మరణంతో ఆమె స్మారకంగా వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఒక వ్యాయామ శాలను పెట్టాలని నిర్ణయించుకున్నాడు. 1997లో ప్రారంభించిన తన ప్రయత్నం ఇప్పుడిప్పుడే ఫలాలను అందిస్తోంది. ఆయనతో పాటు ప్రభుత్వ భవనంలో అదే గ్రామానికి చెందిన బూసరి రవికుమార్ కుమార్‌కూడా అనేక మందికి శిక్షణ ఇస్తున్నారు.

ప్రభుత్వం సహకారం అందించాలి..



వెయిట్ లిఫ్టింగ్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు కీర్తి ప్రతిష్ఠలు తెస్తున్న కొండవెలగాడలో పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించాలి. అధునాతన వ్యాయామ పరికరాలను అందజేయాలి. అన్ని సదుపాయాలు సమకూరిస్తే క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయి పోటీలకు తయారు చేయగలం.

-చల్లా రాము, కోచ్, కొండవెలగాడ

బొబ్బిలి పేరును నిలబెట్టేలా పనులు

● మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి


ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

బొబ్బిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చారిత్రంకగా ప్రసిద్ధి చెందిన బొబ్బిలి పట్టణాన్ని ఆ పేరు ప్రఖ్యాతులకు ఏమాత్రం తీసిపోని రీతిలో తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. వాటిని దశల వారీగా కార్యాచరణలో పెట్టేందుకు అవసరమైన కసరత్తును ప్రారంభించామని తెలిపారు. ఆ ప్రణాళికలు... కార్యాచరణ.. కసరత్తు ఎలా? అనేవి ఆమె మాటల్లోనే...

ప్రశ్న: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికలేంటి?

జవాబు: పట్టణంలోని 31 వార్డులలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన వార్డు ప్రొఫైల్ రూపొందించాం. వార్డు సందర్శనలు, ఇతర కార్యక్రమాల ద్వారా వచ్చిన వినతులు, ప్రజలు తెలిపిన సమస్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేశాం. సుమారు 200కి పైగా పనుల కోసం రూ.128 కోట్లు అవసరం. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద గతంలో రూ.14 కోట్లు, తాజాగా 1.5 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ. 2.50 కోట్లు ఖర్చయ్యాయి. మిగిలిన నిధులతో సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్, తాగునీరు తదితర వాటిని మెరుగుపరుస్తాం.

ప్ర: సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ పార్కు పునర్ వైభవం కోసం ఏం చేయబోతున్నారు?

జ: ఈ పార్కుకు నాటి వైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నాలను ప్రారంభించాం. రామన్నదొరవలస సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంటు పార్కులో ఖాళీగా ఉన్న అర ఎకరా స్థలంలో పండ్లు, కూరగాయలను పెంచాలని నిర్ణయించాం. పొడిచెత్త వినియోగాన్ని మెరుగుపరుస్తాం. తడి చెత్త నుంచి ఎరువుల తయారీని మరింత సమర్థవంతంగా నిర్వహిస్తాం.

ప్ర: మున్సిపల్ పార్కుల నిర్వహణ మాటేమిటి?

జ: రాణి మల్లమ్మదేవి పార్కు, యుద్ధ స్తంభం, పార్కుల అభివృద్ధి కోసం ఒక్కొక్క దానికి సుమారు రూ. 23 లక్షలు అవసరం. ఇంత వరకు రూ.రెండు లక్షలు ఖర్చు చేశాం. జనరల్ ఫండ్‌తో వచ్చే రెండేళ్లలో పూర్తి స్థాయి అభివృద్ధి పనులు చేస్తాం.

ప్ర: మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం ప్రారంభమెప్పుడు?

జ: రూ.7.1 కోట్లతో బొబ్బిలికి మూడు పెద్ద, ఐదు చిన్న ప్లాంట్లు మంజూరయ్యాయి. 3.6 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన పెద్ద శుద్ధి ప్లాంటు పనులను పాకీ వీధిలో ప్రారంభించాం. నాయుడు కాలనీ, గొల్లపల్లి కాలనీల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు కోసం ఒక్కొక్క ఎకరా చొప్పున ప్రైవేటు భూములను కొనుగోలు చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కో ప్లాంటుకు రూ. 9.69 కోట్లు చొప్పున సిద్ధంగా ఉన్నాయి. తహసీల్దారు భూసేకరణ పూర్తి చేసి మాకు అప్పగిస్తారు. ఆ వెంటనే పనులు ప్రారంభమవుతాయి.

ప్ర: వీధి దీపాల సమస్య తీవ్రంగా ఉంది. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

జ: ఇది ముమ్మాటికీ నిజం. ప్రజల నుంచి ఫిర్యాదులు, ఆరోపణలు ఎక్కువగానే ఉన్నాయి. విద్యుత్ పరికరాల కొరత, పర్యవేక్షణ లోపం, సిబ్బందిపై పనిభారం, అలక్ష్యం వంటి సమస్యలు ఉన్నాయి. బైపాస్ రోడ్డులో రూ.10 లక్షలు వెచ్చించేందుకు కౌన్సిల్ తీర్మానించింది. టెండర్లు పిలుస్తాం. ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాల ఏర్పాటుకు రూ.32 లక్షలతో అంచనాలు సిద్ధంగా ఉన్నాయి. బుడా నిధుల కోసం ఎమ్మెల్యే బేబీనాయనతో పాటు బుడా వైస్ చైర్మన్ అయిన జాయింట్ కలెక్టరు దృష్టికి తీసుకెళ్లాం.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



విజయనగరం రూరల్, నవంబరు 5: (ఆంధ్రజ్యోతి): చల్లని తల్లి పైడిమాంబ చదురుగుడి వద్ద మంగళవారం ప్రదర్శించిన రమణకుమారి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళవారం చదురుగుడి వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పైడిమాంబ దీక్షాధారుల సంఘం ప్రతినిధి ఆర్.సూర్యపాత్రో తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబకు ప్రత్యేకాలంకరణ..

చదురుగుడిలో మంగళవారం ఉదయం భక్తులు పైడిమాంబను దర్శించుకున్నారు. మంగళవారం అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పైడిమాంబను వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు.




విద్యార్థినుల నృత్య విన్యాసం

ఆహ్లాదం.. దూరం..

● అభివృద్ధికి నోచని పార్కులు ● కనీస నిర్వహణ కనిపించని వైనం ● గత ఐదేళ్లూ దృష్టి సారించని వైసీపీ సర్కారు


బెలగాం పశుపతినాథ ఆలయ సమీపంలో పార్కు ఇలా..

పార్వతీపురం టౌన్/సాలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో పార్కులైతే ఉన్నాయి గానీ ఏం లాభం? అవి ప్రజలకు ఏమాత్రం ఉప యోగ పడడం లేదు. 'మన్యం'లో చాలా పార్కులు కనీస నిర్వహణకు నోచుకోవడం లేదు. ప్రధానంగా నిధుల సమస్యతో అభివృద్ధికి అడుగులు పడడం లేదు. దీంతో అవి పిచ్చిమొక్కలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల నిరుపయోగంగా మారి ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. మొత్తంగా జిల్లా ప్రజలు ఆహ్లాదకర వాతావరణానికి దూరమవుతున్నారు.


సాలూరు పట్టణ నడిబొడ్డున గాంధీ పార్క్


సాలూరు పట్టణంలో సాలూరు రాజేశ్వరరావు పార్క్ ఇలా..

జిల్లా కేంద్రం విషయానికొస్తే.. బెలగాం చర్చివీధిలో ఉన్న మున్సిపల్ పార్కు ఒక్కటే వినియోగంలో ఉంది. సౌందర్య నారాయణ మూర్తి నగర్, రాయగడ రోడ్డు శివారు, శత్రుచర్ల రియల్ ఎస్టేట్ కాలనీ, బెలగాం శివారున ఉన్న పశుపతి నాథ్ ఆలయ సమీపంలో పార్కులు వినియోగంలో లేవు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వాటి వాటి అభి వృద్ధికి అడుగులు పడ్డాయి. అప్పటి ఇంజ నీరింగ్ విభాగం అధికారులు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సాంకేతిక అనుమతులు కూడా వచ్చాయి. అయితే ఇంతలో ఎన్నికలు జరగడం.. వైసీపీ ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టడంతో పార్కుల అభివృద్ధి ప్రతిపాదనలు మూలకు చేరాయి. దీంతో గత ఐదేళ్లు జిల్లా కేంద్రంలో పార్కులు కనీస అభివృద్ధికి నోచుకోలేదు. కాగా ఇటీవల సౌందర్య నారాయణమూర్తి నగర్‌లో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే విజయ చంద్రలు స్వచ్ఛతాహి కార్యక్రమం చేపట్టారు. ఇదే సమయంలో పార్కు అభివృద్ధి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పట్టణవాసుల్లో ఆశలు చిగురించాయి. జిల్లాకేంద్రంలో మిగతా పార్కులను కూడా సుందరంగా తీర్చిదిద్దాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజును వివరణ కోరగా పార్కుల అభివృద్ధి ప్రతిపాదనలు, నిధుల కేటాయింపునకు సంబంధించి ఇంజనీరింగ్ విభాగ అధికారులతో చర్చిస్తామన్నారు. దీనికోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

సాలూరు పట్టణ ముఖద్వారంలోనే కనిపించే సాలూరు రాజేశ్వరరావు పార్క్, మున్సిపాల్టీలో పెద్దబజార్‌ను ఆనుకుని ఉన్న గాంధీ పార్క్‌లను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గాలి కొదిలేసింది. కనీస స్థాయిలో నిధులు మంజూరు చేయలేదు. దీంతో ఆయా పార్కులు సుందరీకరణకు దూరమయ్యాయి. ప్రస్తుతం అక్కడ ఎటువంటి సౌకర్యాలు లేవు. నిర్వహణ కూడా కరువవడంతో ప్రజలు పార్కుల్లోకి వెళ్లలేకపోతున్నారు. ఎవరైనా అక్కడకు వెళ్లి సేద తీరాలంటే.. ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి.. వాటి పరిసర ప్రాంతాలు చెత్తా చెదారాలతో నిండిపోవడంతో నిత్యం దుర్వాసన వెలువడుతుంది. దీంతో పట్టుమని పది నిమిషాలు కూడా పార్కుల్లో ఉండలేని పరిస్థితి. దీనిపై మున్సిపల్ అధికారులు కూడా పట్టించుకోకపోవడంపై పట్టణవాసులు పెదవి విరుస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

క్రీడాకారుల వివరాలు అందించండి:డీఎస్‌డీవో

విజయనగరం టౌన్/పార్వతీపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారుల వివరాలను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో సేకరిస్తున్నారు. బుధవారం సాయంత్రంలోగా విజయనగరం, పార్వతీపురం- మన్యం జిల్లాల్లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయాల్లో వివరాలు అందించాలని డీఎస్‌డీవో ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల వివరాలు అందించాలని ఆయన కోరారు. సమాచారం కోసం 94917 61327, 83410 52254, 97016 48344 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆరోగ్యంపై అప్రమత్తం

కొత్తవలస, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కలుషిత నీరు, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, మాంసం, చేపలు జీర్ణం కాక వాంతులు, విరేచనాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీల వైద్యాధికారులు గోపాలకృష్ణ, సీతల్ వర్మ తెలిపారు. మంగళవారం ఈ రెండు పీహెచ్‌సీ పరిధిలో ఆరోగ్యంపైఅవగాహన కల్పించారు. ఇప్పటికే గుర్ల వంటి ప్రాంతాలలో డయేరియా వచ్చి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయని వైద్యాధికారులు గుర్తు చేశారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంట్యాడ మండలం పెంట శ్రీరామపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్ర యిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వజ్జపు గోపాలరావుని అదుపులోకి తీసుకుని మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ దాడుల్లో హెచ్‌సీ రాంబాబు, ఈసీలు ప్రసాద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

11న బాలల కోలాటం పోటీలు

బొబ్బిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న బొబ్బిలి మల్టీ టాలెంట్ గ్రూపు సంస్థ ఆధ్వర్యంలో బాడంగి మండలం ముగడలో బాలలకు కోలాటం, డ్యాన్సు పోటీలను నిర్వహించనున్నారు. ఈమేరకు మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త జేసీ రాజు, జి.కరుణకుమార్, పి.చిన్నకృష్ణ, సీహెచ్ అప్పల నాయుడు, పి.నాగరాజు, వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

సాలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న తమకు భద్రత కల్పించాలని కాంట్రాక్టు ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు వారు మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని సాలూరులోని తన స్వగృహంలో మంగళవారం కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే 2024 డీఎస్సీలో తాము పనిచేస్తున్న పోస్టులకు మినహాయించాలని కోరారు. తమను కూడా రెగ్యూలర్ చేయాలని కోరారు. కనీసం రెగ్యులర్ అయినంతవరకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.నాగందొర, అప్పికొండ గణపతిరావు, కె.చంద్రశేఖర్, ముత్యాలు, సోమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

సీతంపేట రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో జరుగు జాతీయ స్థాయి షాట్‌పుట్ క్రీడా పోటీలకు పూతికవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎస్ నైమిశా ఎంపికయ్యారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డిని పూతికవలస పాఠశాల హెచ్‌ఎం శారద జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థిని నైమిశాలు కలిసారు. ఈసందర్భంగా విద్యార్థినిని ఐటీడీఏ పీవో, డీడీ అన్నదొర అభినందించారు. పీవోను కలిసిన వారిలో వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని

దత్తిరాజేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత నెల 25న పువ్వాడ స్కూల్ వేదికగా జరిగిన జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో పి.అనూష ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్‌కు అర్హత సాధిం చింది. ఈ నెల 8,9వ తేదీల్లో గుంటూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతుందని షికారుగంజి ఆదర్శ పాఠశాల పీఈటీ రాజేష్ తెలిపారు. ఆ విద్యార్థినిని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కే.దేవకీవందన, ఎంఈవో మీసాల వెంకటరావు, సుదర్శనరావు, హైమేశ్వరరావు, గణేష్, సురేష్, నారాయణపాత్రుడు, గ్రామస్థులు అభినందించారు.

ఘనంగా నందన్న సంబరాలు



డొంకినవలసలో నందన్నను ఊరేగిస్తున్న దృశ్యం

బాడంగి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డొంకినవలస గ్రామంలో మంగళవారం నందన్న సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందన్న, పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా నందన్న, పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. డొంకినవలసతో పాటు లక్ష్మీపురం, పెదపల్లి, తెంటువలస, కామన్నవలస, గొల్లాది, వీరసాగరం, బాడంగి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపీనాథ్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఆర్నెపల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గౌరీదేవి పండగ

గుర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెదబంటుపల్లి గ్రామంలో గౌరీదేవి పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీదేవిని గ్రామంలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అనుపోత్సవం

గజపతినగరం నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక దిగువ వీధిలో నందన్న అనుపోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పులి వేషాలు, బిందెల డ్యాన్స్‌లతో ఊరేగించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ కె.లక్ష్మణరావుఒ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



గజపతినగరం: నందన్న సంబరాల్లో పులివేషాలు

హామీలన్నీ నెరవేరుస్తా: సీఎం

రాజాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజాం నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మంగళవారం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గంలో ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. రాజాం రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విజయనగరం-పాలకొండ డబుల్ రోడ్డు తదితర వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ త్వరలో అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ వారితో మమేకం కావాలన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం సకాలంలో పూర్తి చేసేలా కృషి చేయాలని సూచించారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు అమలు చేయడంతో మహిళల్లో ఆనందం కనిపిస్తోందని తెలిపారు.



సీఎం చంద్రబాబు నాయుడుకు సమస్యలు వివరిస్తున్న కోండ్రు మురళీమోహన్

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

గుర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేన నాయకుడు సుంకరి రమణమూర్తి అన్నారు. మంగళవారం పాలవలస గ్రామంలో ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నయ్యపేటలో..

రేగిడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంకిలి పంచాయితీలో టీడీపీ నేతలు మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నయ్యపేటలో నేతలు కర్రి రమణ, గంగు క్రిష్ణారావు సవిరిగాన సింహాచలం, కొమరాపు సత్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యత్వాలు నమోదు చేయించారు.

ఆంధ్రా-ఉత్తరాఖండ్ రంజీ మ్యాచ్‌కు సర్వం సిద్ధం

విజయనగరం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రికెట్ మైదానంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న రంజీ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌కు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) తరఫున సర్వం సిద్ధం చేశామని కార్యదర్శి సానా సతీష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర, ఉత్తరాఖండ్ జట్ల మధ్య బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు మ్యాచ్ జరగనుందని తెలిపారు. ఈ పోటీలను క్రికెట్ అభిమానులు, వర్ధమాన క్రికెటర్లు, కళాశాల విద్యార్థులు ఉచితంగా తిలకించవచ్చని ఆయన తెలిపారు. ఆంధ్రా జట్టుకు ఎస్.కె.రషీద్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారని చెప్పారు.

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయండి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 5: (ఆంధ్రజ్యోతి) నగరంలోని బీసీ వసతి గృహంలో ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన కొణతాల శ్యామలరావు అనే విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మరణం వెనుక ఉన్న అన్ని కోణాలను ప్రభుత్వం వెలికి తీయాలని డిమాండ్ చేశారు. శనివారం రాత్రి వార్డెన్‌కు, విద్యార్థికి మధ్య ఘర్షణ జరిగిందని తోటి విద్యార్థులు తెలిపారన్నారు. ఉదయం 8 గంటలకు విద్యార్థి స్పృహ కోల్పోతే, 10 గంటల వరకూ ఆసుపత్రికి తీసుకు వెళ్లకపోవడం వార్డెన్ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. దీనిపై ప్రభుత్వం విచారణ కమిటీ వేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సమీర, శిరీష, జయ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తిని కలిసి వినతిపత్రం అందించారు.

ఎన్నికల కోడ్‌పై అవగాహన సదస్సు

బొబ్బిలి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం తహసీల్దార్ ఎమ్.శ్రీను ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. ఈమేరకు మండలంలోని వీఆర్‌వోలు, పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కోడ్ అమలుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, పరిపాలనా అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

మొక్కల బాధ్యత తీసుకోండి

చీపురుపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొక్కల సంరక్షణ బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని మానవీయత సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు సూచించారు. మంగళవారం ఆయన స్థానిక గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. ఒక్కో మొక్కకు ఆరో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు సంరక్షకులుగా ఉండాలని కోరారు. వీరంతా నాలుగేళ్ల పాటు వీటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాణిశ్రీ, ప్రసాదరావు, యు.హరి, పి.రవి, కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

రామభద్రపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు డిమాండ్ చేశారు. కొట్టక్కి గ్రామంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయకుండా తాత్సారం చేయడం సబబు కాదన్నారు. ఈ నెలలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎన్నికల మేనిఫెస్టో అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ ఎస్టీ కులాలకు సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని ఆనందరావు కోరారు.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ



మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వరరావు

విజయనగరం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే (2025- 26) ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ, మండల, జిల్లా స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీపై రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఏఏపీ-2024-25) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమైంది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన తొలివిడత శిక్షణా కార్యక్రమంలో జెడ్పీ సీఈవో బి.వి.సత్యనారాయణ, డీపీవో టి.వెంకటేశ్వరరావు, ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ జిల్లా పరిశీలకులు సుబ్బారావులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 17 మండలాల ఎంపీడీవోలు, ఈవో (పీఆర్‌అండ్‌ఆర్‌డీ)లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు. రెండో విడత శిక్షణ కార్యక్రమం ఈ నెల 7 నుంచి 8 వరకు రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్టు జెడ్పీ సీఈవో తెలిపారు.

టెట్ టాపర్స్‌కు కలెక్టర్ అభినందన



టెట్ టాపర్స్‌ను అభినందిస్తున్న కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో రాష్ట్ర స్థాయిలో మొదటి, రెండు ర్యాంకులు సాధించిన అభ్యర్థులను కలెక్టర్ అంబేడ్కర్ అభినందించారు జిల్లాకు చెందిన కోండ్రు అశ్విని 150 మార్కులకు గాను 150 సాధించారు. దాసరి ధనలక్ష్మి 149.99 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అలాగే 149.56 మార్కులు సాధించిన దేవ హరిక తృతీయ స్థానంలో నిలిచారు. ఈ ముగ్గురిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈవో మాణిక్యం నాయుడు పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాజాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 7వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆప్తాలమిక్ అధికారి సప్పటి వసంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు.

చోరీ ఘటనపై డీఎస్పీ ఆరా



బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

రాజాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంతకవిటి పోలీసు స్టేషన్ పరిధిలో జీఎంఆర్‌ఐటీ మెయిన్ గేటు ఎదురుగా అపార్టుమెంట్‌లోని శేషగిరిరావు ఇంటిని మంగళవారం చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, రూరల్ సీఐ ఉపేంద్రలు పరిశీలించారు. ఆ ఇంట్లో చోరీ జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితుడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. బంగారం ఇంట్లో ఉన్నపుడు పోలీసులకు సమాచారం అందించినట్లయితే రాత్రి సమయంలో గస్తీ పెంచడానికి అవకాశం ఉంటుందని డీఎస్పీ అన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకొని బాధితులకు న్యాయం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

చీపురుపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన తమ సమస్యలు పరిష్కరించాలని 104 సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.సువర్ణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. 3 నెలలుగా తమకు వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. 104 సేవలను పీహెచ్‌సీ ద్వారాఅందజేయాలని.. 2020 తరువాత విధుల్లో చేరిన వారికి జీఓ నం.7 ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి చెల్లించాలని కోరారు. డీఎస్సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులకు బీమా సౌకర్యం అమలు చేయాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది యూనియన్ ప్రతినిధులు ఎ.రామరాజు, కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 104 వాహనం ద్వారా వైద్యసేవలు అందిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పీహెచ్‌సీ వైద్యులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జి.అప్పలరాజు మాట్లాడుతూ మూడు నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలని, పీహెచ్‌సీ పర్యవేక్షణలో పని చేయించాలని కోరారు. ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు

రాజాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీసీఎస్ఆర్ కళాశాల ఆధ్వర్యంలో జీఎంఆర్‌ఐటీ స్పోర్ట్స్ ఎరీనాలో అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పురుషులు, స్త్రీల జట్టు ఎంపికలు మంగళవారం జరిగాయి. ఈ ఎంపికకు యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ, పీజీ విద్యార్థులు సుమారు 25 మంది హాజరయ్యారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని ప్రిన్సిపాల్స్ ఎం.పురుషోత్తమరావు, రవీంద్ర కుమార్ తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ ఎం శ్రీనివాస్, పీడీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు

శృంగవరపుకోట రూరల్, నవంబరు 5:(ఆంధ్రజ్యోతి) ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు బయలుదేరినట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, జి.లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం భవానీనగర్ వరలక్ష్మి పాఠశాలలో వీరికి శిక్షణ కార్యక్రమం ముగిసింది. పాఠశాల వ్యవస్థాపకురాలు పొట్నూరు వరలక్ష్మి, ప్రిన్సిపాల్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబానికి చేయూత

విజయనగరం క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో పనిచేసి ఇటీవల మరణించిన ఎస్‌ఐ కుటుంబానికి సిబ్బంది సేకరించిన మొత్తాన్ని ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో కుటుంబానికి అందజేశారు. కొత్తవలస పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేసిన కె.వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాలతో ఇటీవల మరణించారు. ఆయన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు చేయూతగా రూ.1 ,48,400 చెక్కును ఆయన సతీమణి బంగారమ్మకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ పి.శ్రీనివాసరావు, కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాకరరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

● పుట్టల వద్ద పూజలు ● కుటుంబ సభ్యులతో సందడి

నాగుల చవితి పర్వదినాన్ని జిల్లా అంతటా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. పుట్టలో పాలు, గుడ్లు, చలివిడి ప్రసాదం వేశారు. భక్తిశ్రద్ధలతో నమస్కరించారు. టపాసులు కాలుస్తూ కుటుంబ సభ్యులతో సందడి చేశారు. పిల్లలు, పెద్దలు ఆనందంగా గడిపారు. **(ఆంధ్రజ్యోతి బృందం)**



బొబ్బిలి రూరల్: జగన్నాథపురంలో..



కొత్తవలస: మునగపాకవానిపాలెంలో మునగపాక ఇంటి పేరు కలిగిన కుటుంబ సభ్యులు



రేగిడి: సంకిలిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న గ్రామస్థులు



ఎల్.కోట: పుట్టకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి



దత్తిరాజేరు: పాచలవలసలో..



భోగాపురంలో..



డెంకాడ: పూజల్లో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు

ఘనంగా నందెన్న అనుపోత్సవం



ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జరజాపుపేటలో మంగళవారం గౌరమ్మ, నందెన్న విగ్రహాల అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. గత కొద్ది రోజుల నుంచి గ్రామంలోని తాడుతూరి వీధిలో పూజలు నిర్వహించారు. గౌరమ్మ, నందెన్న విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, నిమజ్జనం చేశారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైద్య విధానంపై ఆశాలకు శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న హేమాక్షి

పార్వతీపురం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ ద్వారా ఆరోగ్య సంరక్షణ, సాధారణ వ్యాధులు, మధుమేహం నియంత్రణపై ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నామని బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి టి.హేమాక్షి తెలిపారు. దీనికి సంబంధించి ఆయుష్‌శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని, షెడ్యూల్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు సమర్పించామని చెప్పారు. ఈ మేరకు డోకిశీల, పెదబొండపల్లి పీహెచ్‌సీల్లో మంగళవారం ఆశ కార్యకర్తలకు వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఆమె శిక్షణను ఇచ్చారు. ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానం ద్వారా అనేక దీర్ఘకాలిక రుగ్మతలను తగ్గించవచ్చునని, ఇందుకు అనేక ఆయుర్వేద ఔషధాలు ఉన్నాయని వివరించారు. శిక్షణకు సంబంధించి ఆయుష్ శాఖ పంపిణీ చేసిన పుస్తకాలు, బ్రోచర్లను ఆశాడే కార్యక్రమం సందర్భంగా అక్కడకు విచ్చేసిన ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డా.రఘుకుమార్ చేతులమీదుగా ఆశలకు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఐశ్వర్య, కౌశిక్, అనూష, ధరణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం ఎన్నిక

గరుగుబిల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల వీఆర్వోల సంఘ ఎన్నికలు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. మండల వీఆర్వో సంఘ అధ్యక్షుడిగా చినగుడబ వీఆర్వో ఎం.ధనుంజయరావు, ఉపాధ్యక్షుడిగా ఉద్దవోలు వీఆర్వో వి.శ్రీనివాస్, కార్యదర్శిగా రావివలస వీఆర్వో ఎం.గౌరీశంకరరావు, జాయింట్ సెక్రటరీగా సంతోషపురం వీఆర్వో పి.రామకృష్ణ, ట్రెజరర్‌గా పెద్దూరు వీఆర్వో వి.కరుణాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే అసోసియేట్ ట్రెజరర్‌గా గొట్టివలస వీఆర్వో కె.రాఘవరావు, గౌరవధ్యక్షుడిగా తోటపల్లి వీఆర్వో టి.రవికుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వీఆర్వోల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతామని చెప్పారు. వీఆర్వోల సంఘ ప్రతినిధులను తహసీల్దార్ పి.బాల, డీటీ బి.సుందరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సీనియర్ సహాయకుడు రమేష్, జూనియన్ సహాయకులు జి.తేజేశ్వరరావుతో పాటు పలువురు అభినందించారు.

పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలోని ఇంటి పన్నుల వసూళ్లపై కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు సూచించారు. మంగళవారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. సేకరించిన పన్నుల మొత్తాలను విధిగా ఖాతాల్లో జమ చేయాలన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక దృష్ట్యా నియమావళిని పాటించాలన్నారు. పంచాయతీల పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులకు స్కిల్ సర్వే నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏవో ఎన్.అర్జునరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తాడేపల్లికి తరలి వెళ్లిన వైసీపీ నాయకులు

● నేడు స్థానిక ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై నిర్ణయం

సాలూరు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అభ్యర్థిత్వం ఖరారు తదితర అంశాలపై వైసీపీ అధినేత జగన్‌తో చర్చించడానికి ముఖ్యనేతలు మంగళవారం తాడేపల్లికి తరలివెళ్లారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయిన విషయం విదితమే. ఉమ్మడి విజయనగరం లో 549 ఎంపీటీసీలు, 34 జడ్పీటీసీలు, 50 కార్పొరేటర్లు, 110 కౌన్సిలర్లు, 9 ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ మొత్తం 753 స్థానాలున్నాయి. వాటిలో 22 స్థానాలు ఖాళీలు ఉన్నాయి. మిగిలిన స్థానాల్లో పార్టీల పరంగా వైసీపీకి 592 మంది, టీడీపీకి 122 మంది సభ్యులు ఉన్నారు. పార్టీపరంగా వైసీపీకి మెజార్టీ ఉండడంతో ఆ పార్టీలో పలువురు అభ్య ర్థిత్వం ఆశిస్తున్నారు. అభ్యర్థి నిర్ణయం విషయమై తాడేపల్లిలో అధినేత జగన్‌తో ఈనెల 6న చర్చించనున్నారు. ఈ మేరకు వైసీపీ నాయకులు తాడే పల్లికి తరలివెళ్లారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాజన్నదొరకు ఇవ్వాలని సాలూరు వైసీపీ శ్రేణులు కోరుతున్నాయి.

సమస్యలు పరిష్కరించాలి

● 104 వాహన సిబ్బంది డిమాండ్

నెల్లిమర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 104 వాహన సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆ ఉద్యోగుల సంఘం నాయకుడు, జిల్లా కార్యదర్శి డి.జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కొండవెలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి శిరీషకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత మూడు నెలలుగా తమకు రావాల్సిన వేతన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీనియర్ డ్రైవర్లకు కాంట్రాక్ట్ పద్ధతిని వర్తింపజేయాలన్నారు. జీవో నెం.7 ప్రకారం తమకు జీతాలు చెల్లించాలన్నారు. 104 వాహన సిబ్బంది పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధీనంలోనికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగునీటికి కష్టాలు

భోగాపురం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): మండలం భోగాపురం పంచాయతీ కారిగొల్లపేట గ్రామంలో తాగునీరు సరఫరా కాకపోవడంతో అక్కడ ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని పంచాయతీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవ డంలేదని స్థానికులు వాపోతున్నారు. అలాగే గ్రామంలోని రెండు బోర్లు కూడా పని చేయడంలేదని దయచేసి సమస్యలు పరిష్కరించి, తాగునీటి సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు. ఈ మేరకు కారిగొల్లపేటకు చెందిన కొందరు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి ఫిర్యాదు చేశారు.

ఎల్విన్‌పేట చెక్‌పోస్టుకు ప్రతిపాదనలు

పార్వతీపురం/గుమ్మలక్ష్మీపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కురుపాం మార్కెట్ కమిటీకి సంబంధించిన ఎల్విన్‌పేట చెక్‌పోస్టు కోసం స్థలం గుర్తించి పై అధికారులకు ప్రతిపాదనలు పంపనున్నట్టు జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి ఐ.గంగాధరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'పురిపాకలోనే మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు' అనే వార్తకు ఆయన స్పందించారు. ఎల్విన్‌పేట చెక్‌పోస్టుకు ప్రభుత్వ స్థలం లేనందున రోడ్డుపక్కన చిన్న పాక వేసుకొని ఉన్నట్టు చెప్పారు. కానీ అది రోడ్డు విస్తరణలో పోతుందని తెలిసిందని, అనువైన స్థలాన్ని గుర్తించి చెక్‌పోస్టు నిర్మాణానికి ప్రతిపాదనలను పై అధికారులకు పంపిస్తామని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

వివక్ష లేకుండా కోడ్ అమలు చేయాలి

సాలూరు రూరల్, నవంబరు 5: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వివక్ష చూపకుండా కోడ్ అమలు చేయాలని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర కోరారు. ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కోడ్ అమలులో పార్టీల మధ్య వివక్ష చూపరాదన్నారు. శంబరలో, కొత్తవలస మార్గంలో ఇలా పలు చోట్ల అధికార పార్టీ ఫ్లెక్సీలు ఉన్నాయన్నారు. జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షించాలని ఆయన కోరారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 25 సచివాలయాల సిబ్బందికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాల్మన్‌రాజు పాల్గొని స్కిల్ డెవలప్‌మెంట్ యాప్‌పై అవగాహన కల్పించారు. అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంగళవారం మంగళగిరిలోని సచివాలయంలో కలిశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉపయోగకరంగా ఉండేలా ఇండస్ట్రియల్ పాలసీ తీసుకురావాలని ముఖ్యమంత్రిని కోరినట్టు ఎమ్మెల్యే ఇక్కడి విలేకర్లకు ఫోన్‌లో తెలిపారు. దీనిపై చంద్ర బాబు సానుకూలంగా స్పందించారాన్నరు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు కోండ్రు మురళి తదితరులు ఉన్నట్టు ఎమ్మెల్యే చెప్పారు.

పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో కీర్తి

భోగాపురం, నవంబరు 5(భోగాపురం): భోగాపురం గ్రామంలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వైపు వెళ్లే ఎత్తుబ్రిడ్జి డౌన్‌లో పెట్రోల్ బంకు ఏర్పాటుకు ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకోగా ఆర్డీవో దాట్ల కీర్తి మంగళవారం స్థల పరిశీలన చేశారు. పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థలం అనువుగా ఉందా.. లేదా అనే విషయాన్ని పరిశీలించారు. అలాగే ముంజేరు సమీపంలో ఓ వ్యక్తి కల్వర్టు ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోగా అక్కడ స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సురేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.





